# జ్ఞాపకం



## నెహ్రూ మెడలో పాము

నేను నెహ్రూని ముఖాముఖీ చూడటం అదే మొదటి సారి - 1958 నవంబరు 14న - నెహ్రూ జన్మదినం సందర్భంగా ప్రధాన మంత్రి నివాసంలో . వరద రాజేశ్వరరావుగారు 'మోడర్న్ ఇండియన్ పోయెట్రీ ' (14 భారతీయ భాషల్లో రాసిన కొన్ని కవితలకు ఆంగ్లానువాదాలు ) అనే సంకలనాన్ని కూర్చి,' కవిత ' ప్రచురణగా ప్రచురించి ప్రధాని పండిట్ నెహ్రూకి అంకితం ఇచ్చారు. ఆ గ్రంథాన్ని జన్మదినం నాడు ఆయనకి బహుకరించడానికి, అప్పటి పార్లమెంటు సభ్యుడు శ్రీ హరిశ్చంద్ర హెడా, ఆయన సతీమణి శ్రీమతి జ్ఞాన్ కుమారి హెడా గార్లతో కలిసి ప్రధాని నివాసానికి కలిసి వెళ్లాం. ఆ గ్రంథాన్ని నెహ్రూకి బహుకరించడం, మేమంతా కలిసి ఉండగా అక్కడున్న ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీయడం అయాక, ఒక విచిత్ర సంఘటన జరిగింది. తలచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది ! ఆ రోజుల్లో ప్రధాని చుట్టూ పెద్ద రక్షణ వలయం ఉండేది కాదు.

మాలాగే నెహ్రూకి జన్మదిన శుభాకాంక్షల్ని తెలిపేందుకు మరి కొందరు వచ్చారక్కడికి, వారిలో ఒక పాములవాడు ఉన్నాడు. ఎంతటి విష సర్పాలనైనా పట్టుకుని వాటి కోరలు పీకి వాటిని పెంచుతాడట.సన్నగా పొడుగ్గా ఉన్న ఒక పాముని తీసుకొచ్చాడు నెహ్రూకి బహుకరించాలనేమో ! ఆ పాము గురించి ఎంతో వివరంగా చెప్పి, దాన్ని తన మెడ చుట్టూ వేసుకుని, తరవాత నెహ్రూ మెడలో వేస్తానన్నాడు. నెహ్రూ ' స్పోర్టివ్ ' గా సరేనన్నారు. అతడా పాముని నెహ్రూ భుజంమీద వేశాడు. అందరం ప్రాణాలు బిగపట్టుకుని చూస్తూన్నాం. ఆ పాము మెల్లిగా కదిలి నెహ్రూ మెడమీదికి పాకుతోంది. నెహ్రూ ముఖంమీద చిరునవ్వు అలాగే ఉన్నా, మెడ మీద నరాలు బిగుసుకున్నట్లు తెలుస్తోంది. అంతలో ఒక స్త్రీ కంఠం ఖంగుమంది - 'ఏమిటీ నాన్ సెన్స్ ' అంటూ. ఆ కంఠం ఇందిరాగాంధీది ! వెంటనే పాములవాడు ఆ పాముని నెహ్రూ మెడ మీంచి తీసేశాడు. మా ప్రాణాలు కుదుట పడ్డాయి. ఝాన్సీ రాణీలా విజృంభించిన ఇందిరాగాంధీని నెహ్రూ శాంతపరిచారు.

అబ్బూరి ఛాయాదేవి

# మామగారు

"మావయ్యా..మీరు చేస్తూంది మంచి పని కాదు"


పొద్దున్నే అల్లుడలా అనగానే ఒళ్ళు మండింది వెంకట్రావుకు.

పెడసరంగా ఏదో అనబోతూంటే-

నాన్నారూ ..కాఫీ'అంటూ కూతురు పొగలు చిమ్ముతున్న కాఫీ గ్లాసు చేతికందించింది.

గొంతులో మాట గొంతులోనే వుండిపోయింది.

"కూతురి మొహం చూసి ఊరుకున్నాను గానీ.."అని మనసులో గట్టిగా అనుకున్నాడు.



ఇల్లరికపుటల్లుడి పెడసరపు ధోరణి వెంకట్రావుకు అసలు నచ్చట్లేదు. అయితే కూతురి మీద ప్రేమతో నెత్తిన తెచ్చిపెట్టుకున్న కుంపటాయె మరి.

వెంకట్రావు ఏదనుకున్నా,ఏది చెయ్యాలనుకున్నా అల్లుడు అడ్డువుల్లేయ్యంది వూరుకునేవాడు కాదు.మామ జీవితకాలంలో కూడబెట్టిన ఆస్తికి..కీర్తికి దేవుడు నియమించిన కాపలాదారుడిగా తనను భావించుకునేవాడు.

"అమ్మో!పెద్దాయన మాట ప్రకారం వెళితే అంతేసి ఆస్తి ..పేరు ప్రతిష్టలు బుగ్గిపాలు కావల్సిందే"అన్నది అల్లుడిగారి గట్టి నమ్మకం.అందుకే ఉంటుంది మామగారి ఇంట్లోనే అయినా...తింటున్నది ఆయన సంపాదనే అయినా ..పెత్తనమంతా తనదిగానే చేసుకున్నాడు.పైగా తన అత్తగారు బతికేవుంటే తనకిన్ని బరువు బాధ్యతలు వుండేవికావని,అందరిలా తను జల్సాగా వుండేవాడినని ఎంతో ఇదిగా తన స్నేహితులదగ్గర వాపోయేవాడు.

మామ వెంకట్రావుకు ఇదంతా చోద్యంగా వుండేది.పైసా ..పైసా కష్టపడి సంపాదించిన

తనకు దాన్ని నిలబెట్టడం తెలియకపోవడమేమిటి?ఉత్త చేతుల్తో..అనామకుడిగా మొదలయిన తను ..జీవితంలో అనుకున్నవన్నీ సాధించగలిగాడు. ఇద్దరు కొడుకుల్ని పెద్ద పెద్ద చదువులు చదివించాడు. తనకిష్టం లేకున్నా ..ఇద్దరూ అమెరికాకు వెళ్ళిపోయి అక్కడే సెటిలైపోయారు. అక్కడి అమ్మాయిల్నే పెళ్లిళ్లు చేసుకున్నారు.దేశం అంటే మక్కువ తక్కువ.భార్య బతికుండగా ఇవేవీ తను పెద్దగా పట్టించుకోలేదు కూడా! తన పనేదో తనదిగా ఉండేది.

భార్య పోయింది. తోడులేనితనం బాధ తెలిసింది.తలరాతఅనుకుని సర్దుకున్నాడు.

తన కిష్టమైన ఒక్కగానొక్క కూతురు రాధమ్మ తనతోనే ఉండిపోయేలా, ఏమీ లేనివాణ్ణి ఇల్లరికపుటల్లునిగా ఏరి కోరి తెచ్చుకున్నాడు.మొదట్లో మామగారంటే భయభక్తుల్తోనే వున్న అల్లుడు మెల్లమెల్లగా దశమగ్రహంలా మారాడు.వ్యాపారాల మీద..పొలాల మీద అజమాయిషీ తనదే అనిపించేలా ప్రవర్తించసాగాడు.వెంకట్రావు కూతురు రాధకు నాన్న నుంచి ప్రేమేతెలుసు.భర్తగారి అజమాయిషీతో నాన్న మనసు నొచ్చుకుంటోందని తెలిసినా ఏమీ చెయ్యలేకపోయింది.

భార్య మౌనం తను చేసేపనులకు అంగీకారమేనని అల్లుడుగారు భావించేశారు. అవకాశం వచ్చినా...రాకున్నా...అవసరం ఉన్నా...లేకున్నా మామగారిని..ఆయన పనులను అజమాయిషీ చెయ్యటమే తన ఏకైక లక్ష్యంగా మార్చుకున్నాడు.అయినా తను ఎంత కష్టపడితే మాత్రం మామగారంత ఆస్తిని..పేరును సంపాదించగలడు?!ఆయన సంపాదించినదాన్ని జాగ్రత్తగా కాపలా కాస్తే చాలదూ...తర్వాత ఎలాగూ తనదే గదా! అని మొదట్లో అనుకుని కాస్త మంచిగానే ఉన్నాడు. కానీ గుండ్రాయిలాంటి మామగారు ఆ అవకాశాన్ని

ఇప్పట్లో ఇచ్చేలా లేదనుకుని తన ప్రవర్తన మార్చుకున్నాడు.అడుగడుగునా అడ్డుతగలటమే

కాకుండా...అనుదినం మామగారి తప్పులపట్టిక చదవడం తన దినచర్యగా మార్చేసుకున్నాడు.

ఆయనకు మాట్లాడటం రాదనేవాడు...మామగారు మౌనంగా వినేవారు.

ఆయన అంతగట్టిగా నవ్వుతారేమిటి అనేవాడు...మామగారు మౌనమే మంచిదనుకునేవారు.

ఆయనకేమైందనీ ఇరవైనాలుగ్గంటలూ కనిపెట్టుకు ఉండటం...మన ఆఫీసుకొచ్చి అక్కడి పనులు చూసుకోమని భార్యను వ్యాపారం పనుల్లో బిజీ చేశాడు.

ఒంటరి మామకు ఒళ్ళుమండింది. కూతురి మొహం చూసి వూరుకుందామంటే ..ఈమధ్య అమ్మాయి రాధ మొహం కనిపించటమే కరువైంది.ఇక కోపం దాగనంటోంది.

బయట బట్టలుతుకుతున్న పనిమనిషి కనిపించింది.పిచ్చ పిచ్చగా అరిచాడు.ఆ నలభయ్యేళ్ల వితంతువు రాజమ్మ నోరెత్తలేదు.పైపెచ్చు ఆకలేస్తోందిగామోలనుకుని... వెంకట్రావుకు డైనింగ్ టేబుల్ మీద శుభ్రంగా వడ్డించింది.తినేంతవరకు దగ్గరుండి చూసుకుంది.

రెండ్రోజుల తర్వాత వెంకట్రావు ఇంట్లో దేవుడి ముందు రాజమ్మ మెళ్లో తాళికట్టాడు.రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లిని రిజిష్టర్ చేయించాడు.

- రామ్ కె.